# "విచిత్ర అనుభూతి"

రచయిత్రి :
శ్రీమతి జి. రాజ్యలక్ష్మీనారాయణ్

"కుడికాలు లోపలపెట్టమ్మా!" గుంపులో నుండి ఒకావిడ గొంతు నాకు వినిపించింది.

అందులో యేవిధమైన అసూయగాని, అధికారంగాని కనుపించలేదు. "అమాత్రం నాకు తెలీదూ!" నిశ్శబ్దంగా నా మనస్సుపలికింది. అయితే అ సమాధానం ఎంత ప్రమాదమయిందో అందరికీ తెలిసిందే.

ఆడపడుచు కాబోలు హారతి పళ్లెంలో వెలిగించుకుని మా దంపతులకు స్వాగతం యిస్తోంది. అత్తగారు కాబోలు నాకు బొట్టు పెట్టారు. ఆదే ప్రథమంగా నన్ను అత్తవారింటికి తీసుకురావటం. మొదటి గుమ్మం దాటాం.

"పేర్లుచెప్పాలి వదినా! అలాదమాయించుకుని లోపలకొచ్చెయ్యడం కాదు" మా ఆడపడుచు అంది.

"ముందర నీపేరు చెబుదూ!" ఆనాలోచితంగా అడిగేశాను. మావారు నా చెయ్యి కొంచెం గట్టిగా నొక్కారు. "అలా అడగకూడదు" అన్న భావనతో? నాలిక కరుచుకున్నాను. ఏం చెయ్యను మా యింట్లోరీతిగా నేను ఊహించుకున్నాను. మాటకి మాట సమాధానం యివ్వడం నాకు బాగా అలవాటు.

చిన్నప్పుడు అమ్మ ఎన్ని బుద్ధులు చెప్పినా తలకెక్కవు. కాని అత్తగారు చెపితే తప్పకుండా (ఏడుపుతోనైనా) తలకెక్కితీరుతాయి.

"నాపేరు పద్మ — నీపేరు చెప్పువదినా!" అంటూ పద్మ మళ్లీ అంది. రక్షించింది అనుకున్నాను. ఒక చిన్న సంచలనం చెలరేగే పరిస్థితి దాటింది.

"సుశీల" మావారు నాపేరు చెప్పారు.

"శేఖరంగారు" వారిపేరు ముక్తసరిగా చెప్పి ఊరుకున్నాను.

"దట్సగూడ్" అంటూ పద్మ ఒక చిన్న యెగురుయెగిరి మమ్మల్ని లోపలికి తీసుకువెళ్లింది. ఇరుగుపొరుగులు వాళ్ళూ, వీళ్ళూ మొత్తం చాలామంది వచ్చారు. వీళ్ళందర్నీ పెళ్ళిలో చూసినట్టు గుర్తులేదు. పీటలమీద కూర్చున్నప్పుడు పురోహితుడు మంత్రాలు వల్లిస్తున్నాడు. అందరూ తదేకంగా నావేపే చూస్తున్నారు. పెళ్ళికిరాని కొంతమంది "శేఖరంగారికి నేనేవిధంగాతగుదునో" యని కాబోలు ఆలోచించుకుంటూ ముసి ముసి నవ్వులు నవ్వుకుంటున్నారు.

ఫలహారాలు, కాఫీలు జరిగిపోయాయి. 'కొత్తకోడలి'నని కాబోలు నాకేమీ పని చెప్పలేదు.

అత్తవారింటికి సాగనంపేముందు అమ్మ నాకు చాలా చాలా బుద్ధులుచెప్పింది. వాస్తవికంగా అవన్నీ ప్రతీవ్యక్తికి తెలిసేవుంటవి. కాని వాటిని ఆచరించాలనిమాత్రం అనుకోరు. అనుకున్నా తమ భావాల్ని చంపుకుందికి ప్రయత్నించరు. అటువంటప్పుడు ఒకప్రక్కనించి నిప్పుపెడుతూ, ఒకప్రక్కనించి నీళ్ళుపోసి చల్లార్చుతున్నట్లువుంటుంది.

(మా) యింటిలో అడుగు పెట్టినప్పటినుంచి ఒకవిధమైన క్రొత్తతోవలో మెసులుకోవాలి. అత్తవారిల్లు, అత్తింటి కాపురం అనగానే మోచేతిదెబ్బ అని బాగా జ్ఞాపక ముంటుంది. నా అత్తింటి జీవితం ఏ తరహాతో ప్రాతంభించాలో నాకు అంతుచిక్కటంలేదు.

'ఛ! ఏం జన్మ' బాల్యావస్థఅంతా కావలిసినవారిమధ్య సంతోషంతో, ఆనందంతో కొన్ని కొన్ని అభిరుచుల సన్నివేశాలతో జరిగిపోతుంది. ఒకవేళ (పరిస్థితి తటస్థించినప్పుడు) భవిష్యత్తు గురించి ఆలోచించినప్పుడు కష్టాలుకన్న సుఖాలనే ఎగ్కువగా దృష్టిలో నుంచుకొని గాలిమేడలు కట్టుకుంటాం.

కాని ఓ మంచి శుభోదయమందు ఏ మీసాలరాయుడో, ఓ పోజులదొరో, లేకుంటె పాతకాలపు ఖురఖారాయుడో ఎక్కడ్నుంచో 'ఇంటర్వ్యూ' (పెళ్లిమాపులు) అంటూ ఊడిపడతాడు. వాడికిష్టమైనపద్ధతిని పరీక్షించిన తరువాత "మనం ఒప్పుకోవడమా లేక ఇష్టం లేదని చెప్పడమా" అని మనం ఆలోచించుకునేలోపలే ప్రధాన తాంబూలాలు కూడా జరిగిపోతాయి.

ఇక మనతల్లిదండ్రులు ఏదో సమయంలో అడిగేస్తారు "నీకు నచ్చాడా అమ్మా" అని. వాస్తవికంగా నచ్చకపోవచ్చు. కాని మనం "మన ఆలోచనలో" ఉండుటవల్ల వీళ్లమాట పరాకుగా వింటాం. వెంటనే సమాధానం యిచ్చేస్థితిలో ఉండకపోవచ్చు. "అయ్యో పిచ్చిపిల్ల! దానికేం తెలుస్తుందండీ!" అని అమ్మ చెప్పడం నాన్నవినడం, మన ఆలోచన మనతోటే ఉండటం అన్నీ జరుగుతాయి.

ఇలాగే పెళ్లికూడా జరిగిపోయి అత్తవారింటికి వెళ్లటం జరుగుతుంది. స్త్రీ క్రొత్తజీవితం ప్రారంభించాలి. "అణకువ" అవలంబించాలి. ప్రతీపనిలోనూ ఏదో ఒకవిధమైనకష్టం కనిపిస్తూనే వుంటుంది. అత్తగారూ, ఆడపడుచూ, మరుదులూ, ఇరుగుపొరుగు అమ్మలక్కలు వీళ్ల అభిరుచులననుసరించి నడచుకోవాలి. ఇటువంటి ముఖ్యమయిన పాత్రను అర్థంచేసుకోవాలి. తల్లి దండ్రుల గౌరవం దీనిమీదే ఆధారపడివుంటుంది.

స్త్రీజన్మ అంత కష్టసాధ్యమయినది.

ఇటువంటి భావాలన్నీ నా మనస్సులో మెదులుతూండటంవల్లనైతేనేమి, క్రొత్త పరిస్థితులు, క్రొత్తవాతావరణం అవడంవల్లనేమి నేను క్రొత్తప్రశ్నలకు సరిగా సమాధానా లివ్వలేకపోతున్నాను. కొంతమంది "క్రొత్తకోడలు సిగ్గుకదండీ" అని మరి కొంతమంది "చూశావా ఎంత వినయమో" అని ఇలా ఎవరికితోచినట్టు వారు అనుకుంటున్నారు. ఆ మాటలన్నీ నాకు లీలగా చెవినిపడుతున్నాయి.

ఇప్పటివఱకూ నాకోసం 'ప్రత్యేకంగా ఏ పనీ నిర్ణయించలేదు. ఇకముందు యేమో! ఆ సాయంత్రానికల్లా ఒకవిధమైన ప్రశాంతత యేర్పడిందనే చెప్పాలి.

* * *

వేడిపాలు గ్లాసుతో పట్టుకుని గదిలో కొచ్చాను. నిజంగా వారివద్ద నాకు సిగ్గంటూ యేమీలేదు. కాని వారి వాలకంచూస్తే కొంచెం ముభావం నటించాలని బుద్ధిపుట్టింది. వారు ఏదో 'డిటెక్టివ్' పుస్తకం కాబోలు చాలా సీరియస్‌గా చదువుతున్నారు. నేను గదిలో కొచ్చినసంగతే ఆయనకు తెలియనట్టున్నారు. ఎప్పుడూ ఈ మొగరాయిళ్ళు యింతే. ఏ సమయమప్పుడు ఏ పనిచేస్తే బాగుంటుందో కొంచెంకూడా తెలియదు. భోజనాలవేళప్పుడు షికారు చిత్తగిస్తారు. స్నానానికి నీళ్లు వేడిగా సిద్ధమై తయారుచేసేవేళకి గడ్డం గీసుకుందికి రేజరుపట్టుకు సిద్ధమవుతారు. ఉదయం కాఫీ వేళకి నిద్దరే లేవరు.

ఇక భార్య యేదో యింటిపనిలోవుంటే ఏ సినిమాకో, ఏ షికారో రమ్మంటారు. రాకుంటే విడాకులుకూడా యివ్వడానికి వెనుకాడరు.

ఈ భావనలతో కొంత కాలక్షేపం జరిగింది. ఆయనవేపు చూశాను. అబ్బే! యీ లోకం లోనే లేరు. పూర్తిగా పుస్తకంలో లీనమై పోయారు. టైమ్‌పీస్ 'టిక్ టిక్' శబ్దంతప్ప ఆ గదిలో యెటువంటి శబ్దంలేదు! తొమ్మి దయింది.

"ఏమండీ!" అని పిలిచాను.

"............................"

"ఏమండోయ్! మిమ్మల్నే"

"ఓ! ఐ యామ్ సారీ!" ఎంతసేపయింది సుశీ! నువ్వొచ్చి!" ఆశ్చర్యంగా అడిగారు.

"అబ్బే యిప్పుడే లెండి! చూడండి పాలు చల్లారిపోతున్నయి! తీసుకోండి తర్వాత చదువుకోవచ్చు!" అన్నాను.

"థాంక్స్!" అంటూ గ్లాసు తీసుకున్నారు. "చూడు సుశీ!" యీ యింటి వాతావరణం నీకెలావుంది—"విచిత్రమైన ప్రశ్న. నా అనుభూతినిగూర్చి తెలుసుకోవాలని కాబోలు. లేకుంటే మరేమాటలు తోచక అలా అడిగారో!

"అదేమిటండీ! అలా అడుగుతారు! మీతో యెక్కడున్నా నాకు స్వర్గమే కదండీ! ఈ యింటినిగురించి నాకు ప్రత్యేకమైన ఉద్దేశం అంటూ యేమీలేదు!" నా సమాధానం వారిని ఒకవిధంగా నిరుత్సాహపఱచినట్టుంది. అత్తగారు మామగారు మొదలైన వారిని గురించి నా ఉద్దేశం ఆయన తెలుసుకుందామని కాబోలు. అలా ముఖాముఖీని అడుగుతే యెవరైనా 'ఇదమిద్ధం' అని తేల్చిచెప్పరు. అందుకే యీ డొంకతిరుగుడుప్రశ్న. కాని నేను పరీక్షల్లో బిట్టు క్వశ్చన్లు ఆన్సరుచేసే మాదిరి 'ఔను' 'కాదు' అనే తీరుతో చెప్పాను.

"ఇంకా నీకేం తెలుసునులే! పాపం క్రొత్త పెళ్లికూతురివి. ముమ్ముందు ఈ యింటిపరిస్థితి అంతా నీకే తెలుస్తుందిలే! మనోధైర్యం మాత్రం బాగా చిక్కబట్టుకో!" ఆయన అన్న తీరుచూస్తే ఏమీ అర్థంకాలేదు. నాకు ధైర్యం చెప్పే తీరూ కాదు. పిరికిమందు పోయడం కాదు. అంటే భవిష్యత్తుగురించి ఒక సూచన మాత్రం లీలగా తెలిపారని గ్రహించాను.

"మీరు నావారైనంతకాలం నాకేం లోటు వుండదు. మనోధైర్యం నాకు సడలిపోయినా మీరు సర్దుకోగలరనిమాత్రం నాకు ధైర్యముందండీ! ఏమో ఇప్పటికంతా సవ్యంగానే కనిపిస్తుంది. ఇంతకీ మీ మాటల్లోని గూఢార్థము నాకు అవగాహనకాలేదు!" క్రీగంట చూస్తూ ఆయనచేతిలోని గ్లాసును అందుకున్నాను.

"సుశీ!...." నన్ను దగ్గరగా తీసుకున్నారు.

"నేనన్నదాంట్లో ఏముందో నీకు అర్థం కాదులే! కొన్నాళ్లుపోతే వాళ్లలోనే నువ్వుకూడా ఐక్యమయిపోతావు. ఇంతకీ నువ్వు ఏమాత్రం చదివావు!"

"మీ రెలాగనుకుంటున్నారు?"

"అబ్బా! నీతో మాట్లాడటం చాలా కష్టమే! నేనేదో నీవల్ల తెలుసుకోవాలనుకుంటే నన్నే బోల్తా కొట్టించేస్తున్నావే — నీవాలకం చూస్తే కాలేజీ మెట్లెక్కినట్టు కనుపిస్తుంది! కాని నువ్వేమీ చదువుకోలేదంటావు" వారి మాటలు వింటుంటే నాకు నవ్వు ఆగిందికాదు. బలవంతంమీద నవ్వాపుకుని—

"మరి మీరు చదువుకున్నదానిని పెళ్లి చేసుకోనన్నారుగా! నేను చదువుకుంటే మీ పాదదాసిగా కాకపోదును. ఈ భాగ్యం నాకు కలిగేదికాదు! ఇంతకీ నేను అదృష్టవంతురాలిని" వారి కౌగిట్లో కరిగిపోయాను.

★ ★ ★

"అయ్యో! ఇదేంకాలం వచ్చిపడిందే తల్లీ! బారెడుపొద్దెక్కినా నిద్దర్లు తీరవు. అయినా మా కాలంలో మేము ఇలాగా ఉండేవాళ్లమా! కనుచీకటుందనగా లేచి...."

గతుక్కుమన్నాను! నా గదిముందు చిన్న ప్రళయం జరుగుతుంది. వాచీచూస్తే వెక్కిరిస్తున్నట్లు 8 గంటలు చూపిస్తుంది.

విషయం అర్థమయింది. నేను లేచేటప్పటికి కొంచెం (నా దృష్టిలో) ఆలస్యమయింది. ఇప్పుడు బయటకెళితే, పద్మవ్యూహంలోకి అభిమన్యుడు వెళ్లినంతపనీ అవుతుంది. కొంచెం ఆలోచించాను. మా గదిలోంచి వంటింటిలోకి దారివుంది. అలా వెళితే పెరట్లోకి పోవచ్చును. సరే బాగుందనుకుని ఆ తలుపు కొంచెం నిశ్శబ్దంగా తెఱిచేను — అంతే మళ్లీ వెంటనే మూశాను. మామగారు పూజలో వున్నారు-చచ్చాంరా దేముడా! అనుకున్నాను. కొంచెంసేపు ప్రాణాలు బిగపట్టుకుని నించున్నాను. ఇంతలో మామగారు బయటకు వెళిపోయిన చప్పుడు వినిపించింది. 'గుడ్ గాడ్' అనుకుని ఒక్క ఊఱుకుతో వంటింట్లోకి అక్కడ్నుంచి పెరట్లోకి పరుగెత్తాను.

నూతిదగ్గర 'పద్మ' మొహం రుద్దుకుంటూంది. చేదలోనీళ్లు, ఆమె ముఖానికి పట్టించుకున్న సబ్బు కడుక్కుందికివుండాలి. కానీ నాకవేవీ దృష్టిలో లేవు. ఆ చేదనీళ్లు పట్టుకుని బాత్‌రూమ్‌లోకి వెళ్లాను. పద్మ నన్ను చూడలేదు కాబోలు — బాత్‌రూమ్‌లో ముఖం కడుక్కుంటూంటే — నాకు కేకలు వినిపిస్తున్నాయి. పద్మే గావుకేకలువేస్తుంది 'అయ్యో నీళ్లు—నీళ్లు—అని' కాని యింట్లో వారందరు నాగదిముందు యుద్ధసన్నాహంతో వున్నారు. నేనువెళ్లి నీళ్లుతోడి ముందుంచాను.

కొంచెం ముఖం కడుక్కుని 'రక్షించావొదినా! కళ్ళు మండిచస్తున్నాను! నేను నీళ్ళు తోడిపెట్టుకుంటే ఎవరో ముష్టిగాడిదలు పట్టుకుపోయారు' ఆమె ఆలవాటు ప్రకారం తిట్టేసింది. అయ్యయ్యో పాపము శమించుగాక!

"అవునుగానీ నీ వెప్పుడు నిద్దరలేచావు? అమ్మ మండిపడుతుంది!"

"అబ్బా! ఊరుకుందు! అవన్నీ తరవాత, నాకు కడుపులో బాగా మండుతూంది! ఏవేనా చేశారా!"

"ఓ యస్ నేనూ యింకా తినలేదు! వేడి వేడి యిడ్లీచేసింది వంటమ్మ! రా వంటింట్లోకి జొరబడుదాం" అంది పద్మ.

"చూడు వదినా! మనం యింట్లో కూర్చుని యిడ్లీ ఆరగిస్తోంటె అత్తగా రొచ్చి మన వీపులు డబుల్ యిడ్లీ చేస్తారు!"

"అదంతా నీ కెందుకు నాది పూచీ.... వాళ్లంతా యింకా నువ్వు నిద్ర లేవ లేదనుకుంటున్నారు. భేష్ బాగుందనుకుని వంటింట్లో ప్రవేశించాం!

వంటచేసుకుపోతూంది.

ఈమాటా ఆమాటా చెప్పి కాస్త కడుపు నింపుకుని వేడి వేడి కాఫీ తాగాం!

ఒక ప్లేటులో రెండు యిడ్లీవుంచి; కొంచెం (అర్ధ శేరు) కాఫీ వేరుగా గిన్నెలోపోసి (కప్పులు గ్లాసులు చాలవు) అమ్మవారికి బలిప్రదానం తీసుకెళ్తున్నట్టు, నేను పట్టుకుని, నాగదివద్దకు బయలుదేరాను. వదినా! నేను 'శేరమ్మ'కి పోతున్నాను అని కేకవేసి పద్మ వీధిలోకి పరుగెత్తింది.

"అత్తయ్యగారూ!" మృదువుగా పిలిచాను.

"..................." ఆవిడకు వినిపించినట్టు లేదు! మళ్లీ పిలిచాను. నావేపు తిరిగి ఆవిడ

"అదేమిటి నువ్వెప్పుడు లేచావు నిద్ర— ఇంకా నువ్వు...."

"చాలా సేపయిందండీ లేచి! కడుపులో కొంచెం నొప్పిగావుంటె అపుడే బయటికెళ్లొచ్చాను. పాపం మీరింకా టిఫెను తీసుకోలే

దనుకుంటాను—అయినా యిక్కడేం చేస్తున్నారు?" ఏమీ తెలియనట్టు అడిగాను.

"ఆ ఏంలేదు! నువ్వింకా నిద్దరలేవలేదేమోనని...."

"లేపడానికి వచ్చారా....?" శ్రుతికలిపాను!

"అయినా మా వాడింకా లేవలేదేమిటి ? వాణ్ని కొంచెం లేపుతల్లీ....మరీ మొద్దునిద్దర"

"అశ్రమేమీ అక్కర్లేదు! అయినా యింత పొద్దన్నేలేచి నాగదిముందు ఏమిట్రా యీ గోల....మీకేం పనిలేదు?" అంటూ మా వారు లోపల్నించివచ్చారు.

మా అత్తగారు నా చేతిలో ప్లేటు, గిన్నె తీసుకుని వెళిపోయారు. అయన నావేపు చూశారు.

"వెళ్లి ముఖంకడుక్కోండి .... కాస్త మేత తీసుకుందురుగాని" అని చెప్పి నాగదిలోకి పోయాను.

ఈ సంఘటన ఒకవిధంగా నాకు హితబోధ చేసిందనే చెప్పాలి. ఏ చిన్నవిషయమైనా కొండంతలు చేస్తారు. ఏదో ఒకవిధంగా ఇతరులకు వంకలుపెట్టడమంటే మా అత్తగారికి సరదా! ఇంకా ప్రారంభదశలోవుంది అత్తింటి కాపురం. ముందుముందు ఏం జరుగుతుందో! వారు అన్నమాటలు స్మృతిపథంలో మెసులుతున్నాయి కాని, ఇటువంటి వాతావరణంలో వివిధమైన బాధలు పడకూడదని గట్టిగా నిర్ణయించుకున్నాను. నా అంతట నేనే పద్మవ్యూహం ఛేదించాలి! నాకేదైనా కష్టం కలిగించే సంఘటనలు రావచ్చు — ఆయనతో చెపితేమాత్రం ఏం చేస్తారు! చిన్నప్పటినుంచి పెంచినట్టి తల్లిదండ్రులు! ఎప్పుడో యీమధ్య నొచ్చినదాని కోసం వారితో విరోధం తెచ్చుకుంటారా? నాగురించి ఆయనేమి కలుగజేసుకున్నా అది ఆ యింట్లో విరోధమే అవుతుంది! ఇటువంటి విషయాలలో తెలివితేటలతో వ్యవహరించాలి. అందరికీ — నేనంటే అసూయపడే వారందరికీ తగినరీతిగా బుద్ధిచెప్పాలి అని గట్టిగా నిర్ణయించుకున్నాను.

రేడియోట్యూన్‌చేశాను! కర్ణాటక సంగీతం సన్నగావచ్చే వాల్యూమ్‌లో వుంచి గదినర్దడానికి ఉపక్రమించాను.

చిన్నప్పటి రోజులు జ్ఞప్తికి వస్తున్నయి చదువుకునేరోజులు తలుచుకుంటూంటే ఒళ్లు పులకరిస్తుంది. కేరింతాలుకొడ్తూ తోటివాళ్లతో చేతులు కలుపుకుని చెట్టాపట్టా వేసుకుని స్కూలుకి వెళ్తున్నరోజులవి. విచారాలకిగాని చింతలకుగాని చోటులేని రోజులవి! ఆరోజులు తిరిగిరావు. అప్పుడు స్కూలుకి పోతూంటే ఎవరైన నూతనజంట కనుపిస్తే ఆ అదృష్టం కలుగుతే చాలనుకుని మురిసిపోయేవారం! తీరా ఆ స్థితిలోకివస్తే బాల్యస్థితికి రావాలనిపిస్తుంది! అది మానవనైజం — అసంతృప్తి అనేది ఎప్పుడూ ఉండనే వుంటుంది !

ఇక కష్టాలు అనేవి వాటంతటవే వస్తుంటాయి! వాటిని ధైర్యంతో ఎదుర్కోవాలి! అసలు కష్టాలు మన మనోభావనలో నే వుంటాయి. ఒకరికి కష్టం, విసుపుదల కలిగించేపనులు మరొకరికి ఆనందాన్ని కలిగించినప్పుడు ఆశ్చర్యపోనక్కరలేదు ! అవి కేవలం భావనలోనే ఉంటాయని నానమ్మకం. వీటినిగురించి నాస్నేహితులకు, నాకు పోట్లాట జరిగినరోజులుకూడా మరుపురావు! ఇప్పుడా స్నేహితులంతా ఎక్కడెక్కడున్నారో....?

"సుశీ! పేపరొచ్చిందా!" ఆయన స్నానం చేసినతల తుడుచుకుంటూ లోపలికొచ్చారు !

"ఏం పేపరండి!" అన్నాను.

"ఏం పేపరా? కాగితం పేపరు" కనుబొమ్మలు ముడివేసి ముక్కు, మూతి కొంచెం వాటి స్థానంలోంచి మీదికి రప్పించి నావేపు చూశారు. అయనవాలకంచూస్తే నేను చదువు రానిదాని నవడంవల్ల నన్ను వేళాకోళం చేస్తున్నట్టు కనుపిస్తుంది!

"కాగితంపేపరా? పేపరుకాగితం కాదూ ? మీ తెలివికి చాలా మెచ్చుకున్నాం — నే నడిగింది పత్రికా లేక ప్రభా" అని....

"ఓహ్! ఐ యామ్ సారీ — హిందూ—ఐ మీన్" అంటూ అయన యింగ్లీషు ప్రారంభించారు.

"అవున్లే నాదే తెలివి తక్కువ! ఎద్దులకేం తెలుసురా అటుకులరుచి అని వా అలవాటు కొద్దీ అలా మాట్లాడాను అంతే! ఈ కాలంలో కూడా నీలాంటి మొద్దు లున్నారనుకోలేదు" అంటూ అయన బయటకుపోయారు! చచ్చాం రా దేముడా! వీరికి కోపంవచ్చింది కాబోలు—ఎప్పుడూ యింతే-మాట్లాడినంతసేపు సర్దాగా మాట్లాడి కొంచెం మితిమీరితే ఇట్టే కోపంతెచ్చుకుంటారు—ఈ యింట్లోవారుతప్ప నాకు వేరే దైవమెవరున్నారు! ఎన్ని కష్టాలైనా వారి చిరునవ్వుకు సాటిరావు—అన్నీ మర్చిపోవచ్చు—వారిపట్ల తను అతిగా ప్రవర్తించిందేమో! అయ్యో వారిమనస్సు ఎంత బాధపడుతుందో! ఏమైనా సరే యిటుపైని వారికి కష్టం కలిగించేటట్లు ఏ పరిస్థితిలోనైనా ప్రవర్తించకూడదు!

"నేను చాలాసేపు కొట్టుకుపోయాను! గబగబా గదంతా సర్ది రేడియో ఆపుచేసి స్నానానికి పెరట్లోకి వెళ్లిపోయాను!

అవేళ ఆదివారంకావటంవల్ల కోర్టుకిసెలవు! అయన ఇంట్లోనే ఉండొచ్చు—కాని నామీద కోపంచేత కాబోలు అయన పొరుగింటాయనతో ఖాతాఖాని వేసుకుని కూర్చున్నారు—

మామయ్యగారు యివేవీ పట్టించుకోరు! అయనకూడా బాగా అనుభవమున్న లాయర్ బాగా సంపాదించి ఎవరి అపేక్ష అవుసరం లేకుండా ఇంత బాంకిలో వేసుకుని హాయిగా కాలక్షేపంచేస్తున్నారు! ఇంటిలో ఏ గొడవ జరిగినా ఆయన పట్టించుకోరు!

ఎంత సంపదవున్నా, ఎంత చదువుకున్నా ఇంటియిల్లాలు సక్రమ బద్ధమయినదారిలో సంసారాన్ని నడపించనప్పుడు, ఆ సంసారాన్ని దేముడుకూడా సరిదిద్దలేడు. మా అత్తగారు ఆ కోవకుచెందినవారు, అమాయకులు! కాని కొంచెం కోపం హెచ్చు — ఒకవిధమైన అధికారం కావాలని అపేక్ష — ధనవంతులమని గర్వంలేదు! కారణం ఏమిటంటె అమెకు నచ్చినవారితో — ఎటువంటివారైనాసరే, సరదాగా కాలక్షేపం చెయ్యగలరు! గంటలు, రోజులు, వారాలు, యుగాలు కూడా అలా ఖాతాఖానీ చెయ్యడానికి ఓపికవుంది! కొడుకులంటే అమితమైన ప్రేమ—దాన్ని కడుపుతీపి అనవచ్చు — కోడలంటె (నేను) కోపంలేదు, జాలిలేదు, మమకారంలేదు, ఈర్ష్యలేదు—పోనీ బద్ధకస్తురాల్నికాను—మరేమిటో నన్ను ఒకప్పుడు సరదాగా, సంతోషంగా పలుకరిస్తారు! ఒకప్పుడు నెత్తెక్కించుకుంటారు—మరొకప్పుడు తిడతారు—కొట్టినంతపనికూడా చేస్తారు! వారిని ఏవిధంగానూ అర్థంచేసుకోలేకపోతున్నాను! అందుకు నాకు విచారం లేదు కాని, యేవిధంగా ప్రవర్తిస్తే అమె ప్రసన్నులవుతారు! ఇదే ఆలోచన ! ఇంకా కొన్నాళ్లు పోతేనే కాని వారి త్రోవలోకి వెళ్లలేనేమో !

ఒకవిధంగా ఆ యింటిని బాగుచేయాలని నాకో పాడుఆలోచన లేకపోలేదు! 'పాడు' ఎందుకన్నానంటె అటువంటి కష్టమయినపని నే ననుకున్నది! ఆ యింట్లో లోటన్నదిలేదు! దాసీలు, పనిమనుషులు, వంటలక్క చక్కటి భవనం — మంచి సంపద, మనిషి సుఖించడానికి కావలసిన సౌకర్యాలన్నీ వున్నాయి కాని, ఒక్కటి లోపం అదే శాంతి-అదికూడా మా అత్తగారివల్లేనని నేను వేరే చెప్పనక్కర్లేదు! ఏదో ఒక విషయంమీన అవిడ సాగిస్తూనే వుంటారు ఎప్పుడూ గోలే!

అవేళ భోజనాలువేళకి మావారు వచ్చారు! నాతోమాత్రం ముభావంగానే వుంటున్నారు! ఏమో! బహుశా నేను చదువుకోలేదనే నేమో ఆయనకు నామీద ఒకవిధమైన ఏహ్యాభావం!

* * * *

"పాలు చల్లారి పోతున్నా యండి తీసుకోండి"అన్నాను వచ్చి ఎంతోసేపయినా నావేపు అయన చూడలేదు! పుస్తకం చదువుకుంటున్నారు!

"సరే! అక్కడపెట్టి వెళ్ళు" విసురుగా అన్నారు!

"థాంక్స్...." అని అక్కడపెట్టి నేను చాప, తలగడ తీసుకుని వేరేపోయాను! ఎదురుగా వెళుతున్నప్పుడు గోడకు అద్దం ఒకటి వుంది! అందులో అయన స్పష్టంగా కనిపిస్తు

న్నారు! నేనామాట అంటే ఆయనకు ఆశ్చర్యం కలిగిందేమో! నేను వెనుదిరిగిపోతుంటే తదేకంగా నావేపే చూస్తూ—

"ఇలా ఓసారి రా!" పేరులేదు, ఊరులేదు ఎవర్నో ఎద్దుని, పశువుని పిలుస్తున్నట్టున్నాయి ఆ మాటలు! ఇంత అహంకారమా! చదువు కొంతమాత్రంచేత ఆడది మనిషికాదా! ఈ మొగాళ్లంతా యింతే! చదువుకుంటారన్న మాటేగాని, ఒక్క పిసరు సంస్కారముండదు సభ్యత వుండదు!

చూడు రేపు మా ఫ్రెండ్స్ కొంతమంది వస్తారు! వాళ్ళు నేను కలిసి క్యాంపు వెళతాము! ఇక్కడ చిన్న టిఫెను కాఫీ ఏర్పాటు చేసాను! నువ్వు జాగ్రతగా సప్లయి అంటే సర్దుబాటుచూడాలి! వాళ్లంతా గొప్పగా చదువుకున్నవాళ్ళు, చాలా మర్యాదగా వుండాలి సుమా! ఒకవేళ నువ్వు యేదైనా పొరపాటు చేస్తె పనిమనిషివని చెప్తాను తెలుసా! పిచ్చి పిచ్చివేషాలుమాని జాగ్రతగా మసులుకో! ఇక వెళ్ళు" అది ఆర్రాత్రికి నాకు యిచ్చిన ఆర్డర్సు—

మరునాడు అంతా హడావుడిగా సర్దించారు! ఐదారుకుర్చీలు, ఒక డైనింగుటేబిలు సర్దించారు! పది గంటలకల్లా వాళ్ళువచ్చారు! ముగ్గురు యువకులు, ఇద్దరు యువతులు! వారిలో నలుగురు నాకు క్రొత్తవారే! ఒకామె కుంచెం జ్ఞాపకం యివ్వడిప్పడే — ఆ! అరె! శారద! మా క్లాస్‌మేటు! అమాంతం వెళ్ళి ఆమెను యెత్తుకుందా మనిపించింది! కాని చిన్ననాటకం ఆడాలి అనుకున్నాను!

"హలో మిస్టర్ శేఖర్! అంతా హడావుడిగా అట్టహాసంచేశావే! మేమేం క్రొత్తవారమా చెప్పు సింప్లిసిటీమెయిన్‌టెయిన్ చెయ్యాలి సాధ్యమైనంతవఅకూ" అన్నారు అందులో ఒకాయన!

"సింప్లిసిటీకేముంది లెద్దురూ! ఎప్పుడూ ఇలాగే వుంటుంది ఇక్కడ! కాకపోతే మరి రెండు కుర్చీలు అవి తెప్పించానంతే" మా వారంటున్నారు!

నేనంతా రెడీగా వున్నాను! ఆయన వారిని కూర్చోపెట్టి లోపలికొచ్చి కార్యక్రమమంతా ఓసారి చెప్పి మళ్లీ వెళ్లి వాళ్లతోకలిసి కూర్చున్నారు!

నాకు గొప్ప సరదాగా వుంది! మా శారదతో ఎప్పుడు మాట్లాడదాము అని ఆయన చెప్పినట్లే టిఫిన్లు ప్లేట్లతో తీసికెళ్లి టేబిలుమీద సర్దాను!

"శేఖర్! మీ శ్రీమతి యెక్కడుంది! నా కొక్కసారైనా చూపించలేదేం పెళ్లయి యిన్నాళ్ళయిందిగాని, "శారదకుతూహలంగా అడిగింది! కథ మాంచిపట్టులోవుంది! ఆయన సమాధానమేం చెవుతారోనని నాకు గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి! నా ముఖం వాళ్లకు కనుపించకుండా జాగ్రతపడుతున్నాను!

"పోనిద్దురూ! దాని ఊసెందుకు! అది ఇక్కడలేదు. ప్రస్తుతం వాళ్ల నేటివ్‌ప్లేస్‌లో వుంది. అయినా చెప్పుకోదగినంత కల్చర్డ్ ఫెలో కాదు. (షి బిలాంగ్సు టు ఎన్షియంట్ లైఫ్ అన్నారు!"

"ఓహ్! అంటె ఆమె చదువుకోలేదా! అదా మీ అభిప్రాయం" శారద అంటూంది. ఓసి దీని స్టయిలు కాలిపోనూ — మొదట్నుంచీ అంతే బ్రహ్మాండమయిన స్టయిలు దానిసంగతి నాకు తెలుసు.

"అంతే మరి! ఈకాలం చదువుకి తప్ప మరోదానికి స్థానంలేదు .... .... ఇంతకీ నాకా అదృష్టం రాసిపెట్టొద్దూ...." ఆయన నిస్పృహగా అంటున్నట్టున్నారు. నాకు ప్రపంచం యేమీ కనుపించలేదు! హైడ్రోక్లోరిక్ ఏసిడ్ తగుల్తే యెలాగుంటుందో అలాగుంది. వీళ్లకి తగినట్టూ బుద్ధిచెప్పాలి.

వాళ్లకి కాఫీలింకా యివ్వలేదు, మళ్లీ వెళ్లి కాఫీలు చూశాను. వంటమనిషి తయారు చేసింది! అవి చూస్తున్నప్పుడు నా కళ్ళు ఆనందంతో మెరిసాయి. పాతసంఘటన నాకు టకీమని జ్ఞప్తికొచ్చింది. కాఫీలన్నీ ట్రేలో సర్దాను. ఒక్క కాఫీలో మాత్రం కొంచెం తమాషాచేశాను. మామూలుగా అన్నీ సర్ది పట్టుకెళ్లి అందరికి టేబిలుమీద పెట్టాను.

అందరూ కాఫీ త్రాగుతున్నారు! గొప్పగా వుందని మెచ్చుకుంటున్నారు! శారద రెండు గుక్కలు తాగింది! మూతి అదోలా పెడుతూ!

"మిస్టర్! మీ కాఫీ ఎలాగుంది" అని అందర్నీ అడుగుతూంది!

చాలా బ్రహ్మాండంగావుంది అంటూ వాళ్ళు త్రాగుతున్నారు! నాకు ఉపద్రవమైన నవ్వు వస్తుంది! మావారు కొంచెంభయపడ్డట్టున్నారు!

"ఏమండీ! మీ కాఫీ బాగులేదా!" అని శారదను అడిగారు.

"అబ్బే బాగులేకపోవడం కొశ్చన్ గాదు! పంచదార తక్కువయినా ఎక్కువయినా కాఫీ పొడరు మరిచిపోయినా ఇదంతా ఓ తమాషా! కాని కాఫీ ఇలా మిస్చీఫ్‌చెయ్యడం మా సుశీకి అలవాటు! ఇందులో కొంతిగూడ కలపబడింది. నాకే స్పెషలుగా యివ్వడానికి కారణము యేమిటా అని ఆలోచిస్తున్నాను. దయచేసి మీ పనిమనిషి అంటె కాఫీ సప్లయిచేసిందాన్ని నేనోసారి అర్జంటుగా చూడాలి. క్విక్‌గా పిలుస్తారా" శారద ఆతృతగా చుట్టూ చూస్తుంది! మిగిలినవారంతా గొల్లుమన్నారు! మావారు ఇన్‌సల్టు ఫీలవుతున్నారు! క్షమాపణ చెప్పుకుంటున్నారు.

కాని అవేమీ శారద పట్టించుకోలేదు! నన్ను చూడాలని తహతహ లాడిపోతూంది. ఇక లాభంలేదనుకుని నేను గబగబా వచ్చి దాని ప్రక్కన నించున్నాను! మావారు నన్ను తీక్షణంగా చూస్తున్నట్టున్నారు! నాకు తెలుసు. నేనుమాత్రం తలెత్తలేదు. నాకు ఖర్చుకి రెండిద్దురు కాని వాళ్లంతా మళ్లీ యేమనుకుంటారేమోనని మానేశారు.

నా గడ్డంపట్టుకుని శారద ముఖాన్ని పైకెత్తి—

"హలో! డియర్ సుశీ! నువ్వేనా యీ తమాషాచేసింది" అంటూ నన్ను అమాంతం ఎత్తికుదిపింది.

"మిస్టర్ శేఖర్ యీమె మీ పనిమనిషా" అంటూ ఆయనవేపు చూసింది!" ఆయన యీలోకంలో ఉంటేగా—కళ్ళు వప్పగించి నన్నూ—శారదనూ చూస్తూ ఉండిపోయారు! మిగిలినవారంతా అచేతనులయిపోయారు.

"జస్ట్ మిస్టేక్! హి యీజ్ మై హస్బెండ్" అని నే నన్నాను.

ఆయన తేరుకున్నట్టున్నారు! అయితే సుశీ నువ్వు చదువుకున్నావా! అంటూ నన్నడిగారు "నాకేం తెలుసు" అన్నాను!

"చదువుకోవడమేమిటయ్యా! బి.యస్.సి. డిగ్రీలు పుచ్చుకుని మేము విడిపోయాము" అంటూ శారద నావేపుచూసి.

"అయితే సుశీ! ఈయనే మావారని నాకు చెప్పలేదేం! దిష్టి తగులుతుందనా!"

"అబ్బే అదేం కాదులేవే! పెళ్లికి పిలుస్తె నువ్వొచ్చావేమిటి! ఏదో ఇంటర్వ్యూ అంటూ తప్పించుకున్నావు. ఇప్పుడిలా గొప్ప లాయరువై కూర్చున్నావు! యల్.యల్.బి. కంప్లీట్ చేశావా!" అని నే నడిగాను.

"అదేలే ఒక పార్టు ఉండిపోతే మొన్న పూర్తిచేసికొని ఊడిపడ్డాను! నువ్వు బి.ఏ. పూర్తిచేశావా!" అంది.

"ఔనని! ముక్తసరిగా చెప్పాను!"

"కంగ్రాట్యులేషన్సు మిస్టర్ శేఖర్! యు ఆర్ వెరీ లక్కీ ఫెలో చెరో ప్రాక్టీసుపెట్టొచ్చు" అంటూ మావారిని పొగిడేస్తున్నారు. ఆయన తలవంచుకున్నారు.

"సరేలే! సుశీ! రేపు నువ్వుకూడా రావాలి! బెంగుళూరు — మైసూరు ట్రిప్పుకొట్టివద్దాం! శేఖరు! రెడీగా వుంటారు కదూ వస్తాం! O K" అంటూ శారద స్టయిల్ కొడుతూ అందరితో కలిసి వెళ్ళింది.

ఆయన వాళ్ళంతా వెళ్ళిపోయాక నావైపు చూసి నన్ను కౌగిట్లోకి తీసుకుని "ఐ యామ్ సారీ—ఎక్స్క్యూజ్ మి ఫర్ ది యిల్‌ట్రీట్‌మెంటు గివెన్ టు యు డియర్ సుశీ" అన్నారు.

"నెవ్వర్‌మైండ్ — పాస్ట్ యీజ్ పాస్ట్" అంటూ వారితో కలిసి లోనికి పోయాను. ఆ అనుభూతిని యిప్పటికీ మర్చిపోలేను.

★